# 'చెట్ల గోల'

చెట్టు కవి ఇస్మాయిల్ ఇకలేరు అని తెల్సి దిగులేసింది.

అయనా చెట్టూ, కవిత్వం పర్యాయపదాలు కదా!

మా యింట్లో మల్లీ, మందారం, మామిడీ, పారిజాతం, గన్నేరూ, సీమచింతా, టేకు చెట్టూ, వేపా, కానుగా వీటినొదిలి కొత్త ఇంటికి ఎలా వెళ్లాలి.

అక్కడ గడ్డిపరక కూడా లేదాయె.

చెట్లు లేని ఇల్లు ఇల్లు కాదు నాకు.

చెట్టు అంటూంటే కన్నడ కవి డా॥ చంద్రశేఖర కంచార కవిత 'ఆ చెట్టూ - ఈ చెట్టూ' గుర్తుకు వచ్చింది. రఘునాథ, లక్ష్మణరావ్ అనువదించిన సంకలనం చేసిన 'ఆధునిక కన్నడ కవిత' అన్న సంపుటిలోది.

"దొరువు అంచుమీద ఒక చెట్టు
దొరువులో ఒక చెట్టు
కిందిది దాని నీడ
అలలేస్తే ఒకటి వణుకుతుంది
ఇంకోటి నవ్వుతుంది
చివరలు రెండైనా
ఈ చెట్లకు వేరొకటే
నువ్వొక చెట్టెక్కితే
ఇంకోదాని మీద దిగుతావు
తలమీదుగా ఎక్కుతూ
తలకిందుగా దిగుతూ...
ఎక్కుతూ ఎక్కుతూనే గాలివౌతావు
అయినా మరువకు
కిందకు దిగే కర్మ తప్పేది కాదు
ఎక్కడం నీ చేతిలో వున్నా
దిగడం నీ చేతిలో లేదు

ఎక్కినవాళ్లు స్వర్గం చేరుకుంటారని అంటారు...
దాంట్లో మనకు నమ్మకం లేదు
మునిగినవాళ్లకి పాతాళం ఖాయం
కావాలంటే రుజువు చేసుకోవచ్చు
విషాదమయిన ఈ కథలో దోషమేమంటే
నిజమైన చెట్టూ
నీళ్లలోని చెట్టూ
ఇవి రెండూ ఏకమై వుండే చోటు
మాయమై వుండడం...
అందుకే చెబుతానేస్తం
రా! నేలను వెదుకుదాం"
రఘునాథగారో లక్ష్మణరావుగారో ఎవరు చేసారో కానీ అనువాదం
చాలా పేలవంగా వున్నా విషయం తెలుస్తోంది కదా!

సరే చెట్లు లేని ఇంటికి ఎలా మారాలి– పచ్చదనం లేని ఇల్లు ఎంత అసహ్యంగా వుంటుందీ...

దీనికితోడు ఇంకో విషాదం.

ప్లాటుకు అనుకుని ఓ కానుగ చెట్టు చిన్న గున్న ఏనుగులా వుంది. పెద్ద గేటుకు అడ్డమవుతుందని దాన్ని నరికించేయమని మా మోహనరావు బావ...

దాన్ని రక్షించడం నావల్లకాలేదు. మరి చెట్ల సమస్యకు పరిష్కారం?

ఇప్పుడు ఊరూరా పూలమొక్కలమ్ముతూ రాజమండ్రి, కడియం వాళ్లు వున్నారు కదా... ఒకతని దగ్గరకెళ్లాను. సూరిబాబు... అతనికి నా సమస్య చెప్పా.

"అబ్బే మీరేం బెంగపెట్టుకోకండి నాకొదిలేయండి కాంట్రాక్టు. మీ ఇల్లు నందనవనమవుద్ది" అని భరోసా ఇచ్చాడు.

వచ్చి స్థలం చూసాడు. 'సాయంకాలమలా వచ్చేయండి ఎస్టిమేటిచ్చేస్తా' అన్నాడు.

వెళ్లా. ఎస్టిమేటిచ్చాడు పాతిక వేలకి.

'ఇప్పుడు ఇంటికే అప్పు చేసాం. తోటకి పాతికవేలా టాట్' అంది మా జయక్క సరే చూద్దాం...

* * *

**ఆకుపచ్చటి రహస్యాలు అరిచే ఆకులూ**
**రేకు విచ్చి పరిమళాలు పరిచే పూవులూ... ఎప్పుడో ఫ్!** ●